క్లుప్తంగా

రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ

బొబ్బిలిరూరల్: రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందర్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బ్యాటరీ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, దుక్కు, దమ్ము సెట్లు, పవర్ టిల్లర్, పవర్ వీడర్‌లను అందిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులకు రూ.48 లక్షల సబ్సిడీపై ఈ నెలాఖరులోగా వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరం వార్షికోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో మజ్జిగ చలివేంద్రం శనివారం ఏర్పాటు చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని, ప్రజలంతా చలివేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ కోరారు.

క్రీడాసామగ్రి అందజేత


కీడాసామగ్రితో విద్యార్థులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన నమ్మి దుర్గారావు క్రీడాసామగ్రి శనివారం అందజేశారు. తన కుమార్తె ప్రత్యూష జ్ఞాపకార్థం వీటిని అందజేశామని ఆయన అన్నారు. విద్యార్థులంతా చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

న్యాయ అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

బొబ్బిలిరూరల్: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ.. బాలలు, మహిళల సంరక్షణ చట్టాలను వివరించారు. మైనర్ బాలికలు, మహిళలను వేధించిన వారికి కఠిన శిక్షలు పడతాయన్నారు. ప్రతిఒక్కరూ తమ హక్కులు, రక్షణ చట్టాల గుర్చి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎం మోహన్‌కుమార్, న్యాయవాదులు పి.జగన్నాథం, సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే లక్ష్యాలు పూర్తి చేయండి


బొబ్బిలిరూరల్: సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలిరూరల్: స్వమిత్వ సర్వే లక్ష్యాలు పూర్తి చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బొబ్బిలి డివిజన్ పరిధిలో సర్వేకు ఎంపికైన డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు సర్వే నిర్వహణపై శనివారం శిక్షణ ఇచ్చారు. నిర్దేశిత లక్ష్యాల పూర్తి చేయడమే ప్రధానంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాల వివరాలు సేకరించి, నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ మరమ్మతులు


పైపులైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వంగర: మండలంలోని ఎం.సీతరాంపురం తాగునీటి పైపులైన్ మరమ్మతులు శనివారం చేపట్టారు. పంచాయితీ కార్యదర్శి గుత్తావల్లి దీప్తి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో పాడైన పైపులైన్‌ను బాగుచేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.


రాజాం సిటీ: మండల కేంద్రంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం


రాజాం: తృప్తి రిసార్ట్ మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న రిసార్ట్ ఎండీ కృష్ణ మాస్టారు

నేటి సమాజానికి స్ఫూర్తి.. రేపటి సమాజానికి వెలుగు మహిళ!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల సేవలను గుర్తించడానికి, వారిని గౌరవించడానికి ఏటా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పలు సంస్థల్లో పనిచేసే మహిళా సిబ్బందిని సత్కరించారు. నేటి సమాజానికి స్ఫూర్తి, రేపటి సమాజానికి వెలుగు మహిళ అని, స్త్రీ గౌరవింపబడిన చోట అభివృద్ధి, సంక్షేమం ఉంటుందని వక్తలు ప్రశంసించారు. మహిళలపై లింగవివక్ష వద్దని, పురుషులతో సమానంగా వారిని చూస్తూ అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మహిళా సంరక్షణ చట్టాలు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు వివరించారు.
-బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


తెర్లాం: మహిళా చట్టాలు-హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాగర్‌బాబు


వంగర: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వైద్యాధికారిణి జ్యోతి, తదితరులు


బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం


రామభద్రపురం: హోంగార్డు నవీనను సత్కరిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు తదితరులు


బొబ్బిలిరూరల్: జగన్నాథపురం బ్రహ్మకుమారీల ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు, మహిళలు


రేగిడి: దేవుదళ కేజీబీవీలో మహిళా ఉద్యోగులకు సత్కారం


రాజాం సిటీ: సన్ స్కూల్‌లో మహిళలకు మొక్కలు అందించి, సత్కరించిన దృశ్యం

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

రాజాం సిటీ: లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.శారదాంబ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్, న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, రాజీయే రాజమార్గమని, ప్రతి ఒక్కరూ రాజీమార్గాన్ని అనుసరించాలన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంతో పాటు చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు కూడా ఉభయ పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన సివిల్ కేసులకు సంబంధించి, కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 148 కేసులు పరిష్కరించామని, ఆయా కేసులను రూ.83,55,525ల నగదుకు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. పరిష్కారమైన కేసుల్లో సివిల్ కేసులు ఆరు, భార్యాభర్తల తగాదాలు నాలుగు, క్రిమినల్ కేసులు 109, చెక్‌బౌన్స్ కేసులు ఐదు, సారా కేసులు 23, బ్యాంకు ప్రి-లిటిగేషన్ కేసు ఒకటి ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజాం బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షులు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, కార్యదర్శి వై.ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాది రెడ్డి రామ్మూర్తి, లోక్ అదాలత్ న్యాయవాద సభ్యులు ఎ.సత్యనారాయణ, సీహెచ్ శంకరరావు, రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజాం సిటీ: కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

బొబ్బిలి: స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1114 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సివిల్, లో-ప్రానోట్, టైటిల్, ఈపీ, పిలుపు దావా, చెక్‌బౌన్స్, మనోవర్తి, డీవీసీ, ఐపీసీ, ఎక్సైజ్, ఎస్టీసీ తదితర కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

ఆరుతడి పంటల సాగుపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ చంద్రరావు

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని రైతులకు ఆరుతడి పంటల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు పండించడంపై రైతులు దృష్టిసారించాలన్నారు. వేసవిలో కూడా పొలాల్లో ఏదో ఒక పంట సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలా పనులు చేయాలి


రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

రేగిడి: రోజుకు రెండు పూటలా ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఏపీవో ఎస్.హరనాథ్ ఆదేశించారు. మండలంలోని అప్పాపురం పంచాయతీ, మజ్జిరాముడుపేటలో పెద్ద మొక్కవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. వేసవి ఎండల కారణంగా వడదెబ్బ బారినపడకుండా ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేసుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేసుకుంటే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. అలాగే పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.
బాడంగి: ఎనిమిది వారాలుగా ఉపాధి పనులకు సంబంధించి డబ్బులు అందకపోవడంతో వేతనదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఏ వారం డబ్బులు ఆ వారం వచ్చేలా చూడాలని మండలంలోని పలు ప్రాంతాల వేతనదారులు కోరుతున్నారు.

మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి


ధ్రువీకరణ పత్రాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని, అలా అయితే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐజీడీ జిల్లా కో-ఆర్డినేటర్ వై.అశోక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెలప్‌మెంట్, ఢిల్లీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంచి ఆహారపు అలవాట్లు, ఐరన్ లోపిస్తే కలిగే దుష్ప్రభావాలపై శిక్షణ శనివారం ఇచ్చారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యుడు ఎం.చైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

అధికారుల అత్యుత్సాహం

- మహిళా దినోత్సవానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు అందని ఆహ్వానం

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం పట్టణ మెప్మా, వెలుగు శాఖ అధికారులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులుగా ఉన్న లావేటి సులోచనతో పాటు వైస్ ఎంపీపీలు యాలాల సునీత, నక్క వర్షిణిలకు కనీసం ఆహ్వానించకుండా కార్యక్రమం నిర్వహించేశారు. ఎంపీపీగా, వైస్ ఎంపీపీలుగా మహిళలు ఉండగా వారిని పిలవకుండా, వారికి తెలియకుండా వారి కార్యాలయంలోనే మహిళా దినోత్సవం నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌తో పాటు ఆ పార్టీ కార్యకర్తలతో మహిళా దినోత్సవం నిర్వహించిన అధికారులు తమను కించపరిచేలా వ్యవహరించారని, కూటమి పెద్దల ప్రోత్సాహంతోనే ఈ తంతు అంతా జరిగిందని ఎంపీపీ లావేటి సులోచన ఆరోపించారు. మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తాం, సొంత అక్క చెల్లెమ్మల్లా గౌరవమిస్తాం, రాజ్యాంగాన్ని తూ.చ తప్పకుండా పాటిస్తామని గొప్పలు చెప్పే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ మహిళలకు జరుగుతున్న అవమానంపై ఏం మాట్లాడతారో వేచి చూడాలన్నారు. ఇదిలా ఉండగా, ఈ విషయంపై కార్యక్రమ నిర్వాహకులైన వెలుగు ఏపీ చిరంజీవి వద్ద విలేకరులు ప్రస్తావించగా, మహిళా దినోత్సవం చేయాలని ఉన్నతాధికారుల నుంచి అప్పటికప్పుడే సమాచారం అందిందని, మెప్మా అధికారులు ఎంపీపీకి, వైస్ ఎంపీపీలకు ఆహ్వానించి, ఉంటారనే ఉద్దేశ్యంతోనే తాము ఆహ్వానించడంలో అలసత్వం వహించామన్నారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీలు సునీత, వర్షిణి

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శ్రీకాకుళం ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి హాజరైన వందలాది మంది రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.
రాజాం: స్థానిక మల్లిఖార్జున కాలనీలోని గౌరీమల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద మెగా వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వైద్యుడు గోపాలం శివన్నారాయణ రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి


పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహిస్తున్న దృశ్యం

తెర్లాం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని స్థానిక బీసీ బాలుర వసతిగృహం సంక్షేమ అధికారి ఎస్.దాసు కోరారు. అదే వసతి గృహంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ అవర్ శనివారం నిర్వహించారు. విద్యార్థులకు ఏదైనా సబ్జెక్ట్‌లో సందేహాలు ఉంటే వాటిని ఉపాధ్యాయులతో నివృత్తి చేయించారు. విద్యార్థులు కూడా బాగా చదివి మంచిగా పరీక్షలు రాయాలన్నారు. అందరూ మంచి మార్కులతో పాస్ కావాలని ఆకాంక్షించారు.

ప్రమాదకరంగా పోతులజగ్గుపేట రోడ్డు



సంతకవిటి-చిత్తారపురం ప్రధాన రహదారిలో పోతులజగ్గుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని రోడ్డు ప్రమాదకరంగా మారింది. అక్కడి రిటైనింగ్ వాల్ హాంజరాం కాలువలోకి కూలిపోవడంతో రోడ్డు అంచు వరకు ఉన్న మట్టి మొత్తం అదే కాలువలోకి వెళ్లిపోయింది. దీంతో ఆ రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. అటువైపుగా వెళ్తున్న వారంతా ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి, కనీసం హెచ్చరిక బోర్డు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - సంతకవిటి

ఎస్ఐ 'పల్లెనిద్ర'



తెర్లాం మండలం, సుందరాడ గ్రామంలో ఎస్ఐ సాగర్‌బాబు పల్లెనిద్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి రాత్రి అంతా అక్కడే బస చేసి, గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా, ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. - తెర్లాం

వాహనదారుల అవస్థలు



సంతకవిటి మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అక్కడి ఇరుకైన రోడ్డుకు అటు.. ఇటు.. పదుల సంఖ్యలో ఆటోలు పార్కింగ్ చేస్తుండడంతో ఆ దారిలో వచ్చే వాహనదారుల రాకపోకలు కష్టమవుతున్నాయి. గడ్డి, చెరకు లోడుతో ట్రాక్టర్లు, లారీలు వచ్చేటప్పుడు మరీ ఇబ్బందిగా ఉందని, ఒక్కోసారి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోందని, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి, రోడ్డు విస్తరణ చేపట్టడం గానీ ఆటోల పార్కింగ్ వేరేచోట చేయించడం గానీ చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. - సంతకవిటి

పేదరిక నిర్మూలనే పీ4 సర్వే లక్ష్యం


గజరాయునివలసలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ


వంగర: బంగారువలసలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

బాడంగి:

పేదరిక నిర్మూలనే పీ4 సర్వే లక్ష్యమని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో పీ4 సర్వేను శనివారం ప్రారంభించారు. సర్వే సక్రమంగా చేసి, వివరాల నమోదు పక్కాగా చేపట్టాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ఆర్థిక చేయూతనివ్వడమే ప్రధానంగా ఈ సర్వే చేయడం జరుగుతోందన్నారు. సర్వే పారదర్శకంగా జరిగితేనే నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. ముగడ, బాడంగి, గొల్లాది, గజరాయునివలస గ్రామాల్లో కూడా సర్వే జరుగుతోందన్నారు. అక్కడ జరుగుతున్న సర్వేను కూడా పరిశీలించి, సర్వే ఏ విధంగా చేయాలన్న దానిపై సిబ్బంది సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.
వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో పీ4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే శనివారం ప్రారంభమైంది. ఇప్పటికే ఆరంభమైన వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలో ప్రజల వివరాలు సేకరించగా, తాజాగా పీ4 సర్వే ద్వారా జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ ఎంప్లాయ్ అప్లికేషన్‌లో సచివాలయ ఉద్యోగులు వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకునేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

తల్లికి వందనం పేరిట మహిళలకు పంగనామం

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: తల్లికి వందనం పేరుతో సీఎం చంద్రబాబు మహిళలకు పంగనామం పెట్టారని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు విమర్శించారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా మోసగించిన కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుతూ తల్లిదండ్రులకు మద్దతుగా ఈ నెల 12వ తేదీన విజయనగరంలో నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగ యువతను కూడా చంద్రబాబు మళ్లీ మోసం చేశారన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు

ఇప్పటికైనా విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.